# శరీరములేక ఆత్మను, ఆత్మలేక శరీరమును గుర్తించుటకు వీలుకాదు

స్వప్నమునందు గాంచునది
సర్వము సత్యముగానే దోచు
ఆ స్వప్నము వీడి జాగ్రతకు వచ్చిన
ఏమియు కానరాదు, ఆ స్వప్నము నిద్రతో కలయు
సర్వలయంబు పొందుగాని
స్వప్నసుషుప్తి జాగ్రతల
సాక్షియౌ నిత్యమైన ఆత్మ నేను.

సత్యధర్మశాంతి నిత్యమై ఉండిన
ప్రకృతిమాత ఎంతో పులకరించు
విశ్వశాంతి మెచ్చు పుడమి కీర్తియు హెచ్చు
వినుడు భారతీయ వీరసుతుడ!

ప్రేమస్వరూపులారా!

రుచిర్ మూడు ప్రశ్నలు వేశాడు. What is GOD, who is GOD, where is GOD? Everything is GOD, every person is GOD, everywhere is GOD.

**సర్వత్ర సర్వప్రాణులందు ప్రకాశించుచున్న ఆత్మ తత్త్వమును గుర్తించుటయే పురుషార్థము**

దైవము లేని అణువుగాని కణముగాని లేదు. 'సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం సర్వతః శృతిమల్లోకే సర్వమావృత్య తిష్టతి'. కంటికి కనిపించునది, చెవులకు వినిపించునది, మనసునకు అనిపించునది, హృదయమును కదిలించునది, మైమరపించునది దైవమే! కనుక what, who, where అనే ప్రశ్నలకు అవకాశములేదు.



sri sathyasaivachanamrutam

అయితే ఈ సత్యమును ప్రాకృతంగా అనుభవించవలెనన్న కొన్ని విధములైన సత్యములను మనం గుర్తించుటకు ప్రయత్నించాలి. పురుషార్థమే దీనికి చరితార్థము. ఇదియే పరార్థము. ఏమిటి ఈ పురుషార్థములు? ప్రాకృతమైన మార్గమందు, ప్రాకృతమైన ఈ జగత్తునందు ధర్మ అర్థకామమోక్షములు పురుషార్థములని ప్రబోధిస్తూ వచ్చాయి ఉపనిషత్తులు. ఈ పురుషార్థములే పరమార్థమును బోధించే చరితార్థమని బోధించింది ఉపనిషత్తు. అయితే ఈ పదముయొక్క సత్యమును గుర్తించుకొనలేక మానవుడు అనేక విధములైన నానార్థములను కల్పించుకొని యథార్థమును విస్మరించి అనర్థమును మాత్రమే స్వీకరిస్తున్నాడు. పురుష అనగా ఏమిటి? ప్యాంటు, షర్టు, ధోతీ యివి కట్టుకున్నవాడు పురుషుడని భావిస్తున్నారు ప్రాకృతమైన అర్థములో. ఈ పురుషార్థములు సాధించాలని ప్రబోధించినప్పుడు స్త్రీలకు యిందులో ఏమాత్రము అవకాశము లేదా అని వారు కొంతవరకు ఆందోళన చెందవచ్చు. ఈ విధమైన పోటీలకు మూలకారణము, 'పురుష' అనే పదమునకు సరైన అర్థము తెలియక పోవటమే! 'పురుష' అనగా 'ఆత్మ' అని అర్థము. 'పురుష' అనగా 'చేతనము' అని అర్థము. 'పురుష' అనగా 'ప్రాణము' అని అర్థము. ఈ విధముగా 'పురుష' అనే పదమునకు అంత అర్థముంటున్నది. పురుషార్థమును సాధించటమంటే పరమార్థమును సాధించటము. పరతత్త్వమును తెలుసుకోవటమంటే ఆత్మ తత్త్వమును గుర్తించటమే! చేతనాశక్తి సర్వప్రాణులందు ఉంటున్నది. అట్టి చేతనాశక్తిని సాక్షాత్కరింపచేసుకోటమే పురుషార్థము. సర్వత్రా సర్వ ప్రాణులందు ప్రకాశించుచున్న ఆత్మతత్త్వమును గుర్తించటమే పురుషార్థము. పంచభూతముల ప్రమాణమునకు ఆధారమైన దివ్య తేజస్సే ఈ పురుషార్థము. ఇట్టి అంతరార్థమును గుర్తించినప్పుడే పురుషార్థమనే పదమునకు వాదోపవాదములకు వీలులేకుండా ఉంటుంది. శివశక్త్యాత్మక అంతరార్థము అనింది, ఉపనిషత్తు.

**ప్రతి దేహమునందు జడ, చైతన్యముల ఏకత్వము ఇమిడి ఉంటుంది**

ఈ జగత్తునందు ఒకటి జడము, రెండవది చేతనము. ప్రకృతి జడము, ఆత్మయే చైతన్యము. ఈ ప్రకృతియే స్త్రీ. చేతనమే పురుషుడు. ప్రతి దేహమునందు ఈ జడచైతన్యములయొక్క ఏకత్వము యిమిడి ఉంటున్నది. స్త్రీలు అనే జడమే దేహము.

srisathyasaivachanamrutam

చేతనము అనే పురుషుడే ఆత్మ. ఆత్మలేక శరీరము, శరీరములేక ఆత్మ గుర్తించుటకు వీలుకాదు. జడమనగా దేహమే. ఈ దేహమే స్త్రీ. ఇందులో ప్రవేశించి జడమైన దేహమునకు కదలిక కలిగించేదే చేతనాశక్తి. ఈ రెండింటి సన్నిహిత సంబంధ బాంధవ్యమే మానవత్వము. దీనిని ఆధారము చేసుకొనియే 'ఈశ్వరస్సర్వ భూతానాం' అన్నారు. అందరియందున్న ఈశ్వరుడు అర్ధనారీశ్వరుడు అన్నారు. దేహము నారి. ఆత్మ చైతన్యము. కనుక, ఈ స్త్రీపురుషుల సన్నిహిత సంబంధబాంధవ్యమే అర్ధనారీశ్వరతత్త్వము. 'పురుష' అనగా ఆత్మకు, చేతనమునకు మాత్రమే సంబంధించినది. ఈ విధమైన చేతనాశక్తిని గుర్తించటానికి ప్రాకృతమైన మార్గమందు నాలుగు పదములు ఉపయోగపెడుతూ వచ్చారు. అవియే ధర్మ, అర్థ, కామ, మోక్షములనే పురుషార్థములన్నారు. భౌతిక జీవితమందు, ప్రాకృత జగత్తునందు అనిత్యమైన జీవితమునకు ఆధారం ఈ నాలుగు అని మనం విశ్వసిస్తూ వస్తున్నాము.

**ధర్మమనగా నిత్యసత్యమైన అనుభూతియే!**

ధర్మమనగా ఏమిటి? దానము ధర్మము యిత్యాదివి చేయటము, బీదలను ఆదరించటము, దిక్కులేనివారిని పోషించటము ఈ విధమైనవి మనం ధర్మముగా విశ్వసిస్తూ వస్తున్నాము. ఇంకా బ్రహ్మచర్యధర్మము, గృహస్థధర్మము, వానప్రస్థధర్మము, సన్యాసధర్మము అని చెబుతూ వచ్చారు. ఈ విధమైన అర్థములు ఏవియు ధర్మమునకు సరైన అర్థములు కావు. ధర్మమనగా నిత్యసత్యమైన అనుభూతియే! శరీరము ధరించిన ప్రతి వ్యక్తికూడను తన ధర్మము ఏమిటి అని విచారణ చెయ్యాలి. రామరాజుకూడా 'పదవే పోదాము ఓ చిలుకా' అన్నాడు. ఎక్కడికి? 'ఎక్కడనుంచి వచ్చితివో అక్కడ కేగుటనైజము ప్రాణికోటికిన్'. ఎక్కడనుండి వచ్చావో అక్కడికి నీవు పో! అదియే మన నిజమైన ధర్మము. ఆత్మస్థాయినుండి వెలువడిన మానవ జీవితము తిరిగి ఆత్మస్థాయికి చేరుటకు తగిన ప్రయత్నమే నిజమైన ధర్మము. కొందరు అడుగుతారు, 'స్వామీ! ఏదైనా మాకు ఒక మార్గము చూపించండి తరించుటకు' అంటుంటారు. తరించుటకు మార్గము మీరు అడగనక్కరలేదు. తరించుటకు మార్గము అడగటమే ఒక పెద్ద అజ్ఞానము. ఎక్కడినుండి

sri sathyasai vachanamrutam

వచ్చావో అక్కడికి వెళ్లు. వచ్చిన మార్గమును నీవు పట్టుకు వెళ్లు. ఎక్కడనుంచి వచ్చావో నీకే తెలియదు. మార్గము చెప్పి ప్రయోజనము ఏమిటి? ఈనాటి మన జీవితమందు from address లేదు. To address లేదు. ఎక్కడనుండి వచ్చాము from address లేదు. ఎక్కడికి పోవాలి To address లేదు. కనుక మన జీవితమనే letter, dead letter office లో పడిపోతున్నది. ఇదియే భౌతిక జగత్తునందు కృంగి కృశించిపోయే జీవితము. మనము వచ్చిన మార్గమును వెతుకుతూ పోవాలి. మనము వచ్చినది ఎక్కడనుండి?

**బ్రహ్మనుండి వచ్చిన మానవత్వము బ్రహ్మయేగాని మరొకటి కానేరదు**

మనము ఏ దీనినుండి ఉద్భవించామో దాని గుణములే దీనికి సంభవిస్తుంటాయి. మృత్తికనుండి పుట్టిన కుండ మృత్తికయే అవుతుందిగానీ మరొకటి కాదు. మట్టినుండి పుట్టిన కుండ మట్టియే అవుతుందిగానీ ఇంకొకటి కాదు. విత్తనమునుండి వచ్చిన వృక్షము విత్తనముయొక్క స్వరూపమే పొందుతుంది గానీ మరొక ఆకారము ధరించుటకు వీలుకాదు. గుడ్డునుండి పుట్టిన పెట్ట ఆ గుడ్డుకు సంబంధించిన పెట్టగానే అవుతుందిగానీ మరొకటిగా రూపొందుటకు వీలుకాదు. బ్రహ్మనుండి వచ్చిన మానవత్వము బ్రహ్మయేగానీ మరొకటి కాదు. కానీ, ఉపాధిని మనము ఆధారము చేసుకొని ఇదియే నేనని విశ్వసించి 'నేను మానవుడను' అని విశ్వసిస్తున్నాము. ఆకారము మానవత్వమేగానీ ఆధారము ఆత్మతత్త్వమే! నిత్యసత్యమైన పరతత్త్వమునకు ప్రయాణము చేయటమే ప్రకృతిధర్మము. దివ్యత్వమైన ఆత్మతత్త్వమును గుర్తించుటకు చేసే ప్రయత్నమే నిజమైన ధర్మము. ఈ లౌకిక, ప్రాకృత ధర్మములు, ధర్మములు కావు. ఇవి కేవలము మన అభ్యాసములు. ఇవి నిజమైన ధర్మములు కావు. నిజమైన ధర్మము నీ స్వస్వరూప సందర్శన భాగ్యము అందుకోటము.

**ఆత్మజ్ఞానమే నిజమైన ధనము**

అర్థము అనగా ధనము. అర్థమును సంపాయించుకోవాలని ధనకనక వస్తు వాహనాదులతో అనేక విధములైన సంపద ప్రోగు చేసుకొని దానిని పోషించుకొనలేక చిక్కించుకొనలేక అనేక అవస్థలకు గురియైపోయి అనేక అశాంతులకు గురౌతున్నారు. అదికాదు మన ధనము. మన ధనము ఏమిటి? పరమాత్మ తత్త్వాన్ని పొందటానికి ఏ

sri sathyasai vachanamrutam

జ్ఞానము అవసరమో ఆ జ్ఞానమే మన ధనము. సదాచారమే మన సంపత్తు. సత్సంగముయొక్క ఆనందమే మన ఐశ్వర్యము. ధనము, సంపద, ఐశ్వర్యము లోకసంబంధమైన కరెన్సీ కాదు. పవిత్రమైన దివ్యస్థానమును చేర్చే ఆత్మ జ్ఞానమే నిజమైన ధనము. అట్టి అర్థమును మనము సాధిస్తూ రావాలి. కేవలము లౌకికమైన, భౌతికమైన ధనము సంపాయించి ప్రయోజనములేదు. భారతదేశములోని ధనము మరొక దేశములో చెల్లటంలేదు. ఈ లోకములో సంపాయించిన ధనము పరలోకములో ఉపయోగించుకొనుటకు పనికి వస్తుందా? ఇదికాదు, మనము సంపాయించవలసిన ధనము. ఆత్మజ్ఞానమే మన నిజమైన ధనము. సదాచార సంపత్తియే మన నిజమైన ధనము. సద్గుణములయొక్క అభివృద్ధియే మన నిజమైన ధనము. ఇదే అర్థము.

**ప్రాపంచికమైన కోరికలు మనలను బంధించేవేగాని ముక్తిని ప్రసాదించేవి కాదు**

ఇంక కామము. అనగా ఆశలు. ఏమిటి ఈ ఆశలు? ఆశలకు అంతే లేదు. ఈనాడు ఈ ఆశలు హద్దుమీరిపోవటంచేతనే మానవత్వము పశుత్వముగా మారిపోతున్నాది. ఈ దురాశలే దుఃఖమునకు కారణంగా ఉంటున్నాయి. ఇవి కాదు, మనకుండవలసిన ఆశలు. ఇవి కాదు, మనం కోరవలసిన కోరికలు. ప్రాకృత జగత్తునందు తినటానికి అన్నము, కట్టటానికి బట్ట, ఉండటానికి కొంప, రోగమువస్తే తాగటానికి మందు కావాలి. అవే ప్రాకృతమైన ఆధారములు. కానీ ఆశలను కోరికలని భావిస్తున్నారు. అది కాదు, ఉండవలసిన కోరిక. 'ఓ దైవమా! నిన్ను వీడి వచ్చాను, తిరిగి నిన్ను చేరటానికి అవకాశము నాకు అందించు' అని కోరాలి. ఆ అధికారమును కోరటమే నిజమైన కోరిక. 'నిన్ను చేరే అధికారము నాకందించు. ఆ పవిత్రమైన చిత్తశుద్ధిని కల్గించు. ఆ చిత్తశుద్ధిద్వారా నిన్ను నేను పొందటానికి మార్గము చూపించు'. ఇదియే కోరిక అంటే! ఇట్టి నిత్యసత్యమైన కోరికను పక్కకు నెట్టి క్షణములో అదృశ్యమయ్యే కోరికలు కోరుతున్నారు. కనుకనే శంకరులవారు 'మాకురు ధనజనయవ్వనగర్వం, హరతినిమేషాత్ కాల స్సర్వం' అని హితబోధ చేశారు. ఇదా మనం కోరవలసినది? అరనిముషంలోపల కదిలిపోతుంది, ఈ ధనము. కొన్ని దినములలో కరిగిపోతుంది, ఈ యవ్వనము. ఇవన్నీ మధ్యలో వచ్చి మధ్యలోపోయే

srisathyasaivachanamrutam

మేఘముల మాదిరి ఉంటున్నవి. దానికే మనము విఱ్ఱవీగిపోతున్నాము. దానిని చూచి అహంకారపడుతున్నాము. ఈ అహంకారము మరింత బంధిస్తున్నది. ఈ కోరికలు మనలను బంధించేవి గానీ విముక్తి కలిగించేవి కాదు. ఏమిటి, విముక్తి గావించే కోరిక? 'నీ సన్నిధికి నన్ను చేర్చుకో' అదీ సరియైన కోరిక. పురందరదాసు చెప్పాడు, 'స్వామీ! ఈ ప్రకృతిలోకి రావటానికి ఏది కారణము? నిన్ను మరచిపోవటమే దీనికి మూలకారణము. నిన్ను మరచిపోవటము వల్ల ఈ ధరలోకి వచ్చాను. నిన్ను నేను జ్ఞప్తియందుంచుకుంటే నీ దగ్గరనే ఉండేవాడను. అంతా నీవు ఇచ్చినదే! అంతా నీ ప్రసాదమే! నేను కేవలము బీదవాడను, బికారిని కాదు. నేను ఎందుకు బీదవాడనౌతాను? నీవే నా రక్షకుడుగా ఉండినప్పుడు నేను ఎందుకు బీదవాడనౌతాను? సర్వము నీవు ఇచ్చినదే! విద్య చెప్పేది నీవే! బుద్ధి చెప్పేది నీవే! ఉద్ధారకుడవు నీవే! నాకెందుకీ బాధ్యత? ఈ ప్రకృతిలోనున్న ధనమంతా నీవు ఇచ్చినదే! నా హృదయములో నింపిన సద్గుణములు నీవిచ్చినదే! సర్వము లోపల, వెలుపల ఉండిన శక్తులంతా నీవు ఇచ్చినవే! కనుక నేను ఏమాత్రము బికారిని కాను. నేను అనాథను కాదు. ఒకవేళ ఈ లోకములో అనాథ ఎవరైనా ఉంటే నీవే అనాథుడవు. ఓ భగవంతుడా నీవే అనాథుడవు. కారణము ఏమిటి? నీకు మరొక నాథుడులేడు. నాకు నాథుడున్నాడు. నీవే నా నాథుడు. కాబట్టి నేను అనాథుడను కాదు'. ఎంత హృదయ విశాలతతో ప్రబోధించినవి, ఇలాంటివంతా మనకు! ఈనాడు కోరికలు ఏవిధంగా ఉంటున్నాయి? నిత్యసత్యమైన ఆత్మతత్త్వము దగ్గరకు వచ్చి కోరుకున్నప్పుడు, కల్పవృక్షము దగ్గరకు పోయి కాఫీపొడి అడిగినట్లు ఉంటున్నాయి. దైవాన్ని అడగవలసింది ఇదికాదు. 'స్వస్వరూప సందర్శనము నాకు అనుగ్రహించ'మని కోరాలి. 'నీ ప్రేమామృతమును గ్రోలే చిత్తమును నాకందించ'మని కోరాలి. ఆనందామృతమును ఆరగించేవానిగా ఉండాలి. నిత్యానందము, బ్రహ్మానందము, యోగానందము, పరమానందము, అద్వైతానందము అయిన ఆనందమును పక్కన పెట్టుకొని తుచ్ఛమైన భౌతికమైన ఆనందమును మనం కోరుతున్నాము.

**కామితార్థంబిచ్చు కామధేనువు రాగ**
**ధనమిచ్చి యావును కొనగనేల?**

sri sathyasai vachanamrutam

**మించెడి కాంతితో మేరు పర్వతముండ**
**వెండిబంగారుకై వెతకనేల?**
**కామిత ఫలమిచ్చు కల్పవృక్షమెయుండ**
**పెరటి వృక్షమునకై ప్రీతి ఏల?**
**భక్తిముక్తులనిచ్చు భగవంతుడిందుండ**
**పాడు సంసారము కోరనేల?**

ఇది కాదు, మనం కోరవలసినది. కోరవలసినది తననే కోరాలి. 'I want only you. I don't want anything else. అన్నీ నాకున్నాయి. ఉండబట్టి నీవద్ద వచ్చి ఉన్నాను. లేకపోతే నేనుకూడా వెళ్లి పోయి ఉండేవాడను. నాకు లేనిది ఒక్కటే, నీవే! నీవు నాకు కావాలి' అని కోరుకోవాలి. ఈ కోరికయే నిజమైన కామము. ఈ మూడు పురుషార్థములను సాధించినామంటే ఇక మోక్షమే! అదే మోహక్షయము. అదే మోక్షము. ఈ మోహక్షయమే మోక్షము. ధర్మార్థమోక్షకామములను ఈ విధమైన అంతరార్థములతో మనము విచారించినప్పుడు పరిశుద్ధమైన, పవిత్రమైన, విలువైన, యిలాంటి ఘనమైన కోరికలు కలుగుతాయి. వీటిని మనము సార్థకము గావించుకున్న, యిదే నిజమైన పురుషార్థము.

**సర్వ సాధనలు మనోలయము కొరకే!**

ప్రేమస్వరూపులారా! ప్రతి వ్యక్తి దైవమును ప్రార్థించే సమయమందుగానీ పూజించే సమయమందుగానీ, ఆరాధించే సమయమందుగానీ, ధ్యానించే సమయమందుగానీ, జపించే సమయమందుగానీ మనస్సుతో ఇవన్నీ చేస్తున్నాడు. కనుక, తన అభీష్టమును నెరవేర్చుకోలేకపోతున్నాడు. భగవంతుని ధ్యానము చేయాలని కూర్చుంటున్నాడు, పాపం! కదలక మెదలక శవంవలె కూర్చుంటున్నాడు. వాడు నిజంగా శవమే! శివంకాదు. కారణం ఏమిటి? మనస్సుతో ధ్యానిస్తున్నాడు. ఈ మనస్సుతో ధ్యానించేంతవరకు ఏమాత్రము పవిత్రత లభ్యముకాదు. ఎందుకనగా, సర్వ సాధనలు మనస్సును చంపటానికి చేసే పనులు. ఈ మనస్సు ఏమి చేస్తుంది? 'నన్ను చంపటానికి వీడు సాధనలు చేస్తున్నాడు. కనుక, నేను వీడిని చంపుతాను కానీ చావను' అని వానికి విరుద్ధమైన భావమును

sri sathyasai vachanamrutam

అభివృద్ధిపరుస్తుంది. ఏనాడు మనం మనస్సును దూరం గావించుకొందుమో ఆనాడే మన అభీష్టము నెరవేరుతుంది. ఈనాడు సాధన మనస్సుతో చేస్తున్నాం. ఏనాడు మనస్సును చంపుదుమో ఆనాడే మనకు దైవము ప్రత్యక్షమవుతాడు. మనసు మహామారి. మహా మాయలాడి. అదియే లేడి. ఈనాడు మనం ప్రతి ఒకటి మనస్సుతో చేస్తున్నాం. ఇది సరికాదు. మరి ఎట్లా చేయాలి? ప్రేమతో చేయాలి. ప్రేమతో చేసే కొలది పెరుగుతుంది కానీ తరగదు. మనస్సును నీవు చింతించవద్దు. మనస్సు పేరే స్మరించవద్దు. ఉంటే ఉంటుంది పోతే పోతుంది. కానీ ప్రేమతో చేయి. 'ఇది నా కర్తవ్యము. ప్రేమ నా స్వరూపమే! I am the embodiment of Love', అనుకో! Love is God, Live in Love. అదియే నిజమైన సాధన. ఈనాడు ఈ ప్రేమను విసర్జిస్తున్నాము. లౌకిక ప్రేమను పెంచుకుంటున్నాము. భౌతిక ప్రేమలు పెంచుకుంటున్నాము. ఆధ్యాత్మిక ప్రేమ తరిగిపోతున్నాది. అశాంతి పెరిగిపోతున్నాది. లోకములో మనస్సును ఆధారము చేసుకొని సాధించినవానిని ఒక్కడిని చూపించండి! వేదములు అధ్యయనం చేశారు. శాస్త్రములు అధ్యయనం చేశారు. కాని, మనసును చంపుకోలేరు. అన్నింటికి మనకు పరమ విరోధి మనస్సే! కనుక, మనస్సును మనల్ని దరిచేరకుండా చూచుకోవాలి. ఎంతో స్నేహము చేయటానికి వస్తుంది. 'ఓ మనసా! నీవు నా స్నేహితుడవు కావు. దైవమే నా స్నేహితుడు', అని నిర్ణయం చేసుకో! దైవాన్ని స్నేహితుడుగా తీసుకో! ఆయన మైండును తరుమగొడతాడు. భగవంతునికి మనస్సేలేదు. నిర్గుణుడు, నిరంజనుడు, సనాతనుడు, నికేతనుడు, నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపుడు. మనసు లేనివాడు మాధవుడు. మనస్సు ఉన్నవాడు మానవుడు. నీవు మాధవుడు కావాలంటే మనస్సును తరమగొట్టాలి. ఈనాడు మనం మనస్సును అనుసరిస్తూ పోతున్నాము. దానివల్ల మనం కోరిన విషయమును పొందలేకపోతున్నాము. ప్రాకృతమైన ధర్మార్థ కామ మోక్షములలో సత్యనిత్యమైన మార్గమును మనం అనుసరించాలిగానీ లౌకిక ధర్మమును కాదు. 'నాది గృహస్థధర్మము, పిల్లలను భర్తను చూచుకోవాలి' అని దానిలోనే మునిగి పోకూడదు. లౌకిక ధర్మము ఉండవలసిందే; కానీ ఆధ్యాత్మికధర్మమనేది దానికి ఆధారంగా ఉండాలి. పిల్లలను పోషించుకోటం యివంతా ధర్మములు కాదు, కర్తవ్యములు. ఎందుకంటే, నీవు కల్పించుకున్నావు పిల్లలను, భర్తను.



sri sathyasai vachanamrutam

కావాలి అనుకున్న తరువాతనే పెండ్లి అయిందిగానీ లేకపోతే పెండ్లి అవుతుందా? లేదు. కోరి తెచ్చుకున్నది కనుక కర్తవ్యమే! రెండు సంవత్సరములైన తరువాత పిల్లలు కావాలని కల్పించుకుంటున్నావు. పిల్లలైనారు. అన్నీ సంకల్పములయొక్క ఫలితమే! నీకై నీవు తెచ్చుకున్నవి కనుక, కర్తవ్యమే! ధర్మము కాదు. ధర్మమంటే ఏమిటి? తానై తాను ఆవిర్భవించినది ధర్మము. మన ప్రధానమైన, సరియైన ధర్మము ఏమిటి? దైవమును అనుసరించటమే ధర్మము. అదియే సహజధర్మము. సహజధర్మము కావాలి. Artificial ధర్మముకాదు. సహజ ధర్మము heart నుండి వస్తుంది. భౌతిక ధర్మము art నుండి వస్తుంది. Art నుండి వచ్చినది ధర్మము కాదు. Heart నుండి వచ్చినదే ధర్మము. Heart ప్రేమతోకూడి ఉండాలి. ఆ ప్రేమతోనే ఈ ప్రేమను పొందాలి.

**అడుగవలసినది దైవమునే!**

ప్రేమస్వరూపులారా! మనం చేసే సర్వసాధనలు మనస్సుతో చేయక ప్రేమతో చేయాలి. మనస్సు ఒక నిముషంలో యిష్టమంటుంది మరు నిముషంలో వద్దంటుంది. 'మనస్సును అనుసరించటమే నా గతి' అనుకోకూడదు. నీ ప్రారబ్ధము దాన్ని అనుసరించటమా? కాదు కాదు. You are the Master. నీవు భగవంతుడవే! నీవు ఆత్మస్వరూపుడవే! నీవు సకల శక్తిస్వరూపుడవే! నీవు గట్టిగా సంకల్పించుకుంటే సర్వము నీలో ఆవిర్భవిస్తుంది. ఆ విధమైన విశ్వాసము మనము ఈనాడు పెంచుకోవాలి. ఇలాంటి విశ్వాసము ఈనాడు లేకపోతున్నాది. కనుక, ఈనాడు అన్నింటియందు అపజయమే! ఏ దానిలో జయము పొందటంలేదు. ఈనాడు ఈ భావమును మీరు భావిస్తూపొండి. అన్నీ success అయిపోతాయి. Success begets success. కనుక, మనస్సును ఏమాత్రము అనుసరించవద్దు. ఈ మనసు మాయలాడి. మంచిగా చెబుతుంది, చెడ్డను చేస్తుంది. ఎంత విశ్వాసముగా మిమ్ములననుసరిస్తుంది! కానీ, తీసుకుపోతుంది పెద్ద గుంతలోకి. దాని స్వభావము అది. కానీ, మన స్వభావము దాన్ని అనుసరించటంకాదు. దైవమును అనుసరించాలి. ఆ అనుసరణ నీవు తప్పించి కేవలము నీవు మనస్సుకే అనుసరిస్తున్నావు. దేనిని అడగవద్దు. ఎవరిని అడగవద్దు. అడగవలసినది ఉంటే దైవాన్ని అడుగు. అందువల్లనే రామదాసు చెప్పాడు

sri sathyasai vachanamrutam

**అడుగకువె ఓ మనసా**
**అడుగు కొలది అది అడుగున పడునని**
**అడుగకున్న పని వడిగానగునని ॥అడు॥**
**అడుగని శబరిని ఆదరించదే**
**అడుగక తనకై మడియు జటాయువు**
**కడకునేగి సద్గతి కల్గించదే ॥అడు॥**

మనసా! నీవు అడుగుటకు బిచ్చగాడుకాదు. అడుగవలసినది దైవమునే. అందరికి ప్రసాదించేవాడు దైవమే. అంతేగానీ బిక్షగానిదగ్గరకు పోయి అడుక్కోటం నీ కర్తవ్యమా? You are not a begger; you are bigger. ఈ సత్యమును మనం విశ్వసించాలి. అప్పుడే మన సాధనలు విజయము పొందుతాయి. ఈనాడు మనం చేసే సర్వ సాధనలుకూడా మనస్సును చంపటానికి తగిన సాధనలు చేయాలి. నీకు సర్వహక్కులు ఉంటున్నవి. చిత్తశుద్ధితో, భావశుద్ధితో, పవిత్రమైన భావముతో భగవంతుని ప్రార్థించు. భగవంతుడు ఒక్కడే! జీసస్అనిగానీ, బుద్ధుడనిగానీ, అల్లాఅనిగానీ, రాముడనిగానీ యివన్నీ పేర్లు పెట్టుకున్నారు, వారి వారి ప్రీతికోసం. ఒక చిన్న ఉదాహరణము: ఈనాడు బిడ్డ పుట్టింది. మూడవదినము 'అమ్మా! బిడ్డ పేరు ఏమిటి?' అని అడుగుతే 'యింకా పెట్టలేదమ్మా', అంటారు. ఇంకా పెట్టలేదు. ఈ పేర్లు పెట్టినవేగానీ పుట్టుకతో వచ్చినవికాదు. పెట్టిన పేర్లను ఆధారము చేసుకోవద్దు. పుట్టినపేరు ఆత్మ. ఆత్మనే నీవు ఆధారముగా తీసుకో. అట్టి భవ్యమైన, దివ్యమైన దానినే ఆధారముగా తీసుకో. అప్పుడు నిజమైన తత్త్వమును పొందగలుగుతావు.

**భగవంతుడు లేని స్థానముకాని, తానుకాని పదార్థముకాని జగత్తులో కానరాదు**

ధర్మార్థకామమోక్షములనే దానికి ఈనాడు మీరు సరైన అర్థము తీసుకోవాలి. ధర్మమనగా మన స్వస్థానమైన దైవమును పొందే మార్గమును అనుసరించటమే ధర్మము. స్వస్వరూప సందర్శనభాగ్యము కలుగ చేసుకోటమే ధర్మము. ఈ ఆత్మజ్ఞానము పొందటమే నిజమైన అర్థము. వచ్చిన చోటుకు చేరుకోటమే కామము. ఇవంతా ప్రాకృత రీతిగా మనం భావించకూడదు. ఇవి పరార్థమైన ధర్మములు. ఇది నివృత్తి మార్గము. ఈ లోకములో అంతా

srisathyasaivachanamrutam

ప్రకృతిమార్గముగా ఉంటున్నాది. ఎంతకాలమైనా ప్రవృత్తి ప్రవృత్తి! ప్రవృత్తియందే మన జీవితమంతా వ్యర్థముచేస్తే ఏనాడు నివృత్తికి పోయి చేరేది? పుట్టాము మనము, ద్వైతములో. ద్వైతమనే క్లాసు పాస్ చేసి విశిష్టాద్వైతమనే క్లాసులో చేరాలి. విశిష్టాద్వైతమనే క్లాసునుండి అద్వైతమనే క్లాసులో పోయిచేరాలి. ఒక్కొక్క సంవత్సరము పిల్లవాడు ఒక్కొక్క క్లాసు పైకిపోతుంటే ఎంత ఆనందిస్తుంటాడు! అదే విధముగా మనంకూడా ఒక్కొక్క క్లాసు మారుతూ పోవాలి. కానీ, ఈనాటి సాధకులు ఎలా ఉన్నారంటే ఎక్కడ ఉన్నావు గొంగళీ అంటే వేసినచోటే ఉన్నాను అన్నట్లు ఎక్కడ ఉన్న వాళ్లు అక్కడే ఉంటున్నారు. వెంట్రుక వాసి అయినా ముందుకు సాగటంలేదు. ఇంకా విచారణ చేస్తే వెనుకకు వస్తున్నాడు, పాపం! ముందుకు పోవటం లేదు. ముందుకు పోవాలనుకుంటే మనస్సును కట్టిపెట్టు. సాధన మొదలు పెట్టు. అప్పుడు చిత్తశుద్ధి ఏర్పడుతుంది. అప్పుడు భగవంతుని అనుగ్రహమునకు ఒక్క క్షణములో పాత్రుడైపోతాడు. ఎంతకాలముండినా

**పోకన్మానదు దేహమేవిధము పోషించి రక్షించినన్**
**రాకన్మానవు హానివృద్ధులు మహారణ్యమునన్ దాగినన్**

రావలసింది రాక తప్పదు, పోవలసింది పోక తప్పదు. ఎక్కడికి పోయినా దాచుకోటానికి వీలుకాదు. కారణం ఏమిటి? ఎక్కడ చూచినా ఉన్నాడు తాను. తానులేని స్థానముగానీ, తాను కాని పదార్థము కానీ జగత్తులో కానరాదు. What is God అనటంగానీ, Who is God అనటంగానీ, Where is God అనిగాని ఈ questions కు మనం ఏమాత్రం అవకాశము యివ్వకూడదు. ఎవరైనా వచ్చి Where is God అని అడుగుతారు. సందేహించక I am God అని చెప్పు ధైర్యంగా! I am God దేహమునకు సంబంధినది కాదు. You are also God. He is also God. Everything is God. 'బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి'. వానికి కాదనుకుంటే కాదు. దైవము కాదు అంటాడు. కాని నీకు కాదు. 'నాకు అవును. నీ తల్లి నీకు ఎంత ప్రీతియో నా తల్లి నాకంత ప్రీతి. నా దైవము నాకున్నాడు. నా దేవుడు లేదనటానికి నీవు ఎవరు? నీకు లేకపోతే లేకపోవచ్చు. నాకున్నాడు, నాకున్నాడు' అని ఈ విధమైన పూర్ణవిశ్వాసము ఈనాడు యువకులు పెంచుకుంటూ రావాలి. సందేహమునకు అవకాశమే యివ్వకూడదు.

srisathyasaivachanamrutam

అనుమానమునకు అవకాశము యివ్వకూడదు. ఆత్మవిశ్వాసముతోనే మనం ముందుకు సాగాలి. అప్పుడే మనము విజయము సాధించగలము. మనము ఈ ధర్మార్థ కామ మోక్షములను లౌకికమైనవిగా భావించుకోకుండా సహజమైన దివ్యస్థాయి భవ్యస్థాయి అయిన దైవమును పొందే మార్గము, దైవత్వమును తెలుసుకునే జ్ఞానము, దైవత్వమును అందుకునే కోరిక కోరుతూ రావాలి.

**(తేదీ 23-10-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam